ఆంధ్రజ్యోతి
2 JUL 2018

# ఘనంగా ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ వార్షికోత్సవం



విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తున్న దృశ్యం

**యానాం, జూలై 1:** ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించారు. మాజీ సైనికుల పిల్లలు ఇంటర్‌మీడియట్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన కారుమూరి ఎన్ఎస్ఎస్ లక్ష్మీ, బొండాడ శివ చందనలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గూడూరి సాయిబాబు, అడ్వైజర్ పంపన గణేశ్వరరావు, నల్లా బుల్లివెంకన్న, సాబు మాత్యూస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు యానాం రానున్న ఎస్సీ కమిషన్ సభ్యులు

**అంబేద్కర్‌నగర్ (యానాం), జూలై 1:** జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు కె.రాములు సోమవారం యానాం రానునట్టు యానాం సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షులు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 2,3 తేదీలలో యానాంలో పర్యటిస్తారని ఢిల్లీ నుంచి సమాచారం అందిందన్నారు. ఆది ద్రావిడ సంక్షేమశాఖ విడుదల చేసిన రూ.2.95 కోట్లు సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం, 2016-17 విడుదల చేసిన రూ.99 లక్షల నిధులను కేవలం ఎస్సీ సంక్షేమానికి సంబంధం లేని పనులపై వ్యయపరిచిన సంఘటనలను దర్యాప్తుకు వస్తునట్టు ఫిర్యాదుదారుడైన తనకు సమాచారం అందించారన్నారు.



యోగా పోటీలలో ప్రతిభ సాధించిన విద్యార్థులు

# యోగా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

**యానాం, జూలై 1:** ఇటీవల మచిలీపట్నంలో నిర్వహించిన 5వ స్టూడెంట్స్ ఒలింపిక్స్ గేమ్స్‌లో యానాం యోగా సెంటర్ విద్యార్థులు ప్రతిభ సాధించారని యోగా టీచర్ పేర్ని ఆదినారాయణ మూర్తి తెలిపారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లోని పిరమిడ్ యోగ ధ్యానమందిరంలో వైసిటీ యోగా సెంటర్ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థులు పతకాలు సాధించారని అన్నారు. డేగల లంగరి బంగారు పతకాన్ని, పి. కౌశిక్, పి. అభిరామ్ వెండి పతకాలను, ఎం. వెంకటేశ్వరి, బి. విజయ్ కాంస్య పతకాలను సాధించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

## నేడు జగన్ పాదయాత్ర

**యానాం, జూలై 1:** వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తలపెట్టి ప్రజాసంకల్ప యాత్ర సోమవారం యానాం మీదుగా సాగనుంది. దీంతో యానాం ఎదుర్లంక వారధి, రోడ్లను పార్టీ జెండాలతో నాయకులు అలంకరించారు. సోమవారం ఉదయం ఎదుర్లంకలోని పాత ఇంజరంలోని ప్రారంభమైన కొద్ది సేపటికే పాదయాత్ర యానాం చేరుకోనుంది. యానాం ఎదుర్లంక వారధి నుంచి సుమారు కిలోమీటరు మేరలోనే యానాం పాదయాత్ర ముగియనుంది.

## నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

**యానాం, జూలై 1:** సోమవారం నుంచి పుదుచ్చేరి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను నిర్వహించనునట్టు అసెంబ్లీ కార్యదర్శి విన్సంట్ రాయ్ తెలిపారు. తొలిరోజు ఆర్థిక మంత్రి హోదాలో సీఎం నారాయణస్వామి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వాస్తవానికి జూన్ 4వ తేదీన ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు కేంద్రం డ్రాఫ్ట్ బడ్జెట్‌ను ఆమోదించకపోవడంతో అర్ధంతరంగా వాయిదా పడిన విషయం తెలిసిందే.